సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

అభివృద్ధి శూన్యం



జీవీఎంసీ 45వ వార్డు పరిధిలో గల వరాహగిరి కాలనీ

- కొండవాలులో కనీస వసతులు కరవు
- స్థానికులకు విద్య, వైద్య సదుపాయాలు దూరం
- దశాబ్దాలుగా పట్టించుకోని పాలకులు, అధికారులు



సత్యసాయినగర్‌లో వినియోగించని పాత సామాజిక భవనం



సింహగిరికాలనీలో శిథిలావస్థకు చేరి మూతపడిన బాల్యం భవనం

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 45వ వార్డు కొండవాలు ప్రాంతంలో కనీస వసతులు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరం మధ్యలో ఉన్నప్పటికీ ఈ ప్రాంతం భీమిలి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోకి వస్తోంది. ఈ క్రమంలో కొన్ని దశాబ్దాలుగా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ఉన్న సదుపాయాలతోనే స్థానికులు కాలం వెళ్లదీస్తున్నారు. అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతున్నా ఇక్కడ మాత్రం కనీస వసతులు లేవు. వార్డు పరిధి సింగాలమ్మపురం, సింహగిరికాలనీ, సత్యసాయినగర్, వరాహగిరికాలనీ – 1, వరాహగిరికాలనీ – 2 ప్రాంతాల్లో నివసించే వారికి కనీసం ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ ఆస్పత్రి కూడా అందుబాటులో లేవంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏ ఆరోగ్య సమస్య వచ్చినా సుమారు నాలుగైదు కిలోమీటర్ల దూరంలో గల ప్రభుత్వ ఆస్పత్రికి పరుగులు తీయాల్సిందే. లేదంటే వేలాది రూపాయలు ఖర్చు పెట్టి ప్రైవేటు ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిందే. ఇక పేద విద్యార్థులకు విద్యనందించే స్కూళ్లయితే వార్డులో అస్సలు లేనే లేవు. ప్రభుత్వ పాఠశాలకు చేరాలంటే జాతీయ రహదారిని దాటుకుని వెళ్లాల్సిందే. లేదా మురళీనగర్ వైపు మూడు, నాలుగు కిలోమీటర్లు దాటి వెళ్లాలి. ఈ బాధలు పడలేక కొందరు ప్రైవేటు స్కూళ్లను ఆశ్రయిస్తుంటే, మరికొందరు చదువులు మానేసి పనులను వెతుక్కుంటున్నారు. గతంలో వార్డులో గల ఏకైక ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాల పోర్టు స్కూల్‌ను మూసేశారు. దీనిపై స్థానికులు అనేక పోరాటాలు చేసినా పోర్టు ట్రస్ట్ గానీ, ప్రభుత్వాలు కానీ పట్టించుకోకుండా పాఠశాల మూసేశారు. అప్పటి నుంచి పేదలకు చదువు సైతం దూరమైందనే చెప్పుకోవాలి.

అంగన్‌వాడీ కూడా లేదే... : జీవీఎంసీ 45వ వార్డు పరిధిలోని ఈ కాలనీల్లో కనీసం అంగన్‌వాడీ కేంద్రం కూడా లేదు. దీంతో తమ చిన్నారులను తాటిచెట్లపాలెంలోని కేంద్రానికి తల్లిదండ్రులు తీసుకెళ్తున్నారు. సింహగిరి కాలనీలో బాల్యం భవనం ఉండేది. అది శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారడంతో దానిని మార్చేశారు. అయితే ఆ భవనం స్థానంలో మరో భవనం నిర్మించడమో... ఇతర వసతులు కల్పించడమో చేయనే లేదు. గతంలో కూడా దీనిపై అధికారులకు విన్నవించినా స్పందించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఈ ప్రాంతంలో కనీసం సామాజిక భవనం కూడా లేదు. ఎవరైనా వివాహాలు, ఇతర శుభ కార్యక్రమాలు చేసుకుందామన్నా సరైన సదుపాయం లేదు. దీంతో రోడ్డుపైన, లేదా ప్రైవేట్ ఫంక్షన్ హాల్స్‌లోనే కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. ఇలా చేసుకోవడం పేదలకు ఆర్థికంగా భారంగా మారుతోంది.

కాలనీల పరిస్థితి మారడం లేదు

మా కాలనీల్లో సామాజిక భవనం నిర్మించాలని ఎంతో కాలంగా పాలకులు, అధికారులను అడుగుతున్నాం. ఎవరూ స్పందించడం లేదు. ఎంత మంది నాయకులు మారినా మా కాలనీల పరిస్థితి మాత్రం మారడం లేదు. ఏదైనా శుభకార్యమైతే వేలాది రూపాయలు ఖర్చు పెట్టి ప్రైవేట్ ఫంక్షన్ హాల్స్‌ను ఆశ్రయించాల్సి వస్తోంది. పేద వారిపై ఆర్థికంగా భారం పడుతోంది.

– జి.రమ, సత్యసాయినగర్

వైద్యం అందుబాటులోకి తేవాలి

వరాహగిరికాలనీ, సింహగిరి కాలనీ, సత్యసాయి నగర్ ప్రాంతాల్లో అంగన్‌వాడీ, పీహెచ్‌సీ లాంటి సదుపాయాలు కల్పించాలి. ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకపోతే ఉసూరుమంటూ కేజీహెచ్‌కు వెళ్లాల్సి వస్తోంది. అంత దూరం వెళ్లలేకుంటే ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి లక్షలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వ వైద్య సేవలను మాకు అందుబాటులోకి తీసుకురావాలి.

– కె.రమేష్, వరాహగిరికాలనీ

అంగన్‌వాడీ కేంద్రం లేక ఇబ్బందులు

మా కాలనీల పరిధిలో చిన్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రం లేక దూర ప్రాంతాల్లోని కేంద్రాలకు పిల్లలను పంపించాల్సి వస్తోంది. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఇక్కడ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి. గతంలో ఇక్కడ నిర్వహించే బాల్యం భవనం మూతపడడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు.

– అన్నపూర్ణ, సింహగిరికాలనీ

సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ



శ్రీలలితా పీఠంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ చేస్తున్న భక్తులు

సీతంపేట : మార్గశిరమాసం శనివారం సందర్భంగా అక్కయ్యపాలెం శ్రీ లలితా పీఠంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. పలువురు భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పారాయణ చేశారు. ముందుగా స్వామికి సుప్రభాత సేవ, సహస్ర నామార్చన, విశేష హారతులిచ్చారు. ఈ నెల 16న సోమవారం ఉదయం 6:45 గంటల నుంచి జనవరి 13 వరకు ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాలు నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

వైభవంగా సుప్రభాత సేవ

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం విశేష హారతి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

నిరుపయోగంగా గ్రీన్‌బెల్ట్ గ్రిల్స్



జాతీయ రహదారిలో నిర్లక్ష్యంగా వదిలేసిన ఇనుప గ్రిల్స్

కంచరపాలెం : జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెం జాతీయ రహదారి రెడ్డి కంచరపాలెం నుంచి దేవేంద్రనగర్‌కు వెళ్లే గ్రీన్‌బెల్ట్ రక్షణ గేట్లు నిర్లక్ష్యంగా వదిలేశారు. జీవీఎంసీ జోన్ – 5 ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్లు గ్రీన్‌బెల్ట్‌కు రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్ నిరుపయోగంగా వదిలేయడంతో దొంగల పాలవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని, గ్రిల్స్‌కు రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ నేడు

మురళీనగర్ : మురళీనగర్ వైశాఖి స్పోర్ట్సు పార్కులో ఆదివారం ఉదయం 6 గంటలకు స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తామని పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, కార్యదర్శి సూర్యనారాయణ రాజు చెప్పారు. ఈ పోటీల్లో జిల్లా స్థాయి క్రీడాకారులు పాల్గొంటారన్నారు. క్రీడాకారులు నిర్దేశించిన సమయానికి హాజరుకావాలని సూచించారు.

18 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కె.శాంతారాం సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో మహారాష్ట్రలోని పూణేకు చెందిన సాగర్‌బాపు ముతేకర్ 18 కేజీల గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. గంజయి సీజ్ చేసి నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం నేడు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం గాంధీనగర్ వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తామని డాక్టర్ రహమతుల్లా ఆస్పత్రి అధినేత డాక్టర్ రహమతుల్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రి వద్ద ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 11 వరకు బీఎండీ, థైరాయిడ్, షుగర్, యూరిక్ యాసిడ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు 98669 70816లో సంప్రదించాలని ఆయన కోరారు.

భవిష్యత్‌లో ఇంధన సంరక్షణ కీలకం



రమణారావును సన్మానిస్తున్న ప్రతినిధులు

తాటిచెట్లపాలెం : శుభ్రమైన, పచ్చదనంతో కూడిన భవిష్యత్‌ను నిర్మించుకోవడంలో ఇంధన సంరక్షణ కీలక పాత్ర పోషిస్తుందని ఏపీఈపీడీసీఎల్ రిటైర్డ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆర్‌వీ రమణారావు తెలిపారు. జాతీయ ఇంధన సంరక్షణ దినోత్సవాల్లో భాగంగా దొండపర్తిలో గల ది ఇంజినీర్స్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా (విశాఖపట్నం లోకల్ సెంటర్) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆవిష్కరణలు, విధానాలు, వినియోగం, సాంకేతికత ద్వారా ఇంధన సంరక్షణ లక్ష్యాలను సాధించగలమని వివరించారు. సంస్థ చైర్మన్ డాక్టర్ కేవీ రామమోహనరావు మాట్లాడుతూ ఈ దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా ఇంధన సంరక్షణ, సుస్థిర విధానాలపై అవగాహన కల్పించే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ కార్యదర్శి డాక్టర్ చల్లా సురేష్, కమిటీ సభ్యులు, కార్పొరేట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యువ చైతన్య దినోత్సవం



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు, తదితరులు

సీతంపేట : గురజాడ వర్ధంతి సందర్భంగా సహృదయ సాహితి, గురజాడ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా – భారత్ సంయుక్త నిర్వహణలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో యువ చైతన్య దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులు రచించిన "మీ పేరేమిటి" గురజాడ కథలు, మహా కవితా ఖండికలు, ప్రకాశిక 4వ సంచికను ప్రముఖ కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురజాడ మహాకవి అని, రచనల ద్వారా సమాజంలో మార్పు ఆశించారన్నారు. శేఖర మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ గురజాడ తెలుగు సాహిత్యానికి దశ, దిశ నిర్దేశించారన్నారు. ముత్యాలసరాలు అనే నూతన ఛందస్సు రచించి తెలుగుతల్లికి విలువైన హారాన్ని సమర్పించారని కొనియాడారు. గురజాడ ఫౌండేషన్ సంచాలకులు కొవ్వలి గోపాలకృష్ణ మాట్లాడుతూ గురజాడ రచనలు, కవితలు, కథానికలను ఆవిష్కరించడం హర్షదాయకమన్నారు. గురజాడ కవితా సౌరభం అనే అంశంపై రచయితలు డి.వి.సూర్యారావు, కె.జి.వేణు, ఎ.సీతారత్నం విశ్లేషణాత్మక ప్రసంగాలు చేశారు. కార్యక్రమంలో పలువురు రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

ధనుర్మాసోత్సవాల కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న చైర్మన్ టీఎస్ఎన్ మూర్తి

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డులోని నరసింహనగర్ దరి గణేష్‌నగర్‌లో గల త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ టీఎస్ఎన్ మూర్తి, గౌరవాధ్యక్షుడు నల్లమిల్లి వెంకటరెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఆలయంలో శనివారం కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి జనవరి 13 వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా శ్రీ కోదండ రామస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. జనవరి 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటలకు కోదండరామునికి అభిషేకాలు, ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామన్నారు. 13న గోదాదేవి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు జి.కృష్ణ, కార్యదర్శి ఎంఎస్ ప్రకాశరావు, ప్రధాన అర్చకుడు ఏడిద గురునాథ శర్మ, సహాయ అర్చకుడు శశికుమార్, కమిటీ సభ్యులు పి.రమ, సీహెచ్.నరసింగరావు, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఖోఖోలో బుల్లయ్య జట్టుకు ద్వితీయ స్థానం



ఖోఖో జట్టుతో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్, తదితరులు

సీతంపేట : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఆంధ్రా యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళల ఖోఖో టోర్నమెంట్‌లో లంకపల్లి బుల్లయ్య కళాశాల మహిళల జట్టు ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో 11 కళాశాలలు పాల్గొనగా బుల్లయ్య విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపి రెండో స్థానంలో నిలిచారు. త్వరలో కాలీకట్‌లో జరగబోయే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో పోటీలకు బుల్లయ్య కళాశాల నుంచి ముగ్గురు విద్యార్థినులు హేమ, చైతన్య దీపిక, నవ్యశ్రీ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

త్యాగాలకు ప్రతిరూపమే విశాఖ ఉక్కు



నిరసన శిబిరంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార: జీవీఎంసీ గాంధీ పార్కులో విశాఖ ఉక్కు పరిరక్షణకు జరుగుతున్న దీక్షలు 1356వ రోజుకు చేరుకున్నాయి. సీఐటీయూ జగదాంబ జోన్ నాయకులు, సభ్యులు శనివారం ఈ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు వై. రాజు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ 32 మంది ప్రాణత్యాగం, 61 మంది కమ్యూనిస్టుల పదవీ త్యాగం, 67 గ్రామాల ప్రజలు ఇళ్లు, భూములు, చివరికి దేవాలయాలు కోల్పోవడం ద్వారా వచ్చిందని గుర్తు చేశారు. ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. కానీ ప్లాంట్ తాలూకు డివిడెండ్ల ద్వారా రూ. 50 వేల కోట్లకు పైగా ప్రభుత్వం ఆర్జించిందని తెలిపారు. ప్లాంట్ పూర్తిగా విశాఖకు మాత్రమే చెందుతుందని, దీన్ని అమ్మే హక్కు ఏ ప్రభుత్వానికి లేదన్నారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు కె. సంతోష్‌కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు కె.నర్సింగరావు, హాస్పిటల్స్ యూనియన్ నాయకుడు నూకరాజు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మార్గశిర పౌర్ణమి పూజలు నేడు

సీతంపేట: మార్గశిర పౌర్ణమి సందర్భంగా అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో విశేష పూజలు నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. పౌర్ణమి సందర్భంగా ఆదివారం ఉదయం 5 గంటలకు లలితా అమ్మవారికి పాలాభిషేకం, 9 గంటలకు మణి ద్వీపంలో మహా మేరువుకు శ్రీచక్రనవావరణ, 11 గంటలకు అమ్మవారి సన్నిధిలో శ్రీచక్ర నవావరణ నిర్వహిస్తామని తెలిపారు. అలాగే దత్త జయంతి సందర్భంగా ఉదయం 10 గంటలకు దత్తాత్రేయ స్వామికి అభిషేకం నిర్వహిస్తామని తెలిపారు.

ధనుర్మాస వేడుకలకు సిద్ధం



ప్రత్యేక అలంకరణలో సంపత్ వేంకటేశ్వరస్వామి

కంచరపాలెం : గొల్ల కంచరపాలెం శ్రీసీతారామ సంపత్ వేంకటేశ్వరాలయంలో ఈ నెల 16న సోమవారం నుంచి ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ తెలిపారు. రోజూ ఉదయం 5 గంటలకు ప్రాతఃకాలార్చన, తిరుప్పావై సేవ, విశేష భోగం, పాశుర విన్నపం నిర్వహిస్తామని తెలిపారు. జనవరి 10న ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని పూలంగి సేవ, కూడార్పై, ఉత్తర ద్వార దర్శనం, విశేష అర్చన నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి 13న వేంకటేశ్వర స్వామికి పంచామృత అభిషేకం, ఉదయం 4 గంటలకు సీతారాములకు పల్లకీలో తిరువీధి మహోత్సవం, ఉదయం 10 గంటలకు గోదా రంగనాయకుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

ఫాదర్ రాజ్‌కుమార్‌కు డాక్టరేట్



ఫాదర్ రాజ్‌కుమార్

కంచరపాలెం: విశాఖ జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల భావోద్వేగ ప్రజ్ఞ, బోధనా సామర్థ్యం, బోధనాభిరుచుల మధ్య ఉండే పరస్పర సంబంధాలపై నగరానికి చెందిన ఫాదర్ చిటికెల రాజ్‌కుమార్ పరిశోధనలు చేశారు. ఆంధ్ర యూనివర్సిటీ ఆచార్యులు ఆర్. శివప్రసాద్ పర్యవేక్షణలో పరిశోధనలు పూర్తి చేయడంతో ఆయనకు వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయంలో రెవరెండ్ ఫాదర్‌గా, సెయింట్ మేరీస్ విద్యాసంస్థలకు ప్రిన్సిపాల్‌గా అనేక సేవలు అందించిన రాజ్‌కుమార్‌కు డాక్టరేట్ రావడంతో జ్ఞానాపురం ప్రజలు, క్రైస్తవ సోదరులు ఆనందం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి జానపద కళా ఉత్సవం నేడు



జానపద ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్, తదితరులు

సీతంపేట : భారత సాంస్కృతిక సహకార స్నేహ సంస్థ(ఇస్కఫ్) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'రాష్ట్ర స్థాయి జానపద కళా ఉత్సవం' వైభవంగా నిర్వహిస్తామని సంస్థ ప్రధాన కార్యదర్శి డి.మార్కండేయులు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన కార్యాచరణపై శనివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్ దాస్ ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దంపట్టే జానపద కళలను భావితరాలకు అందించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. కళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు ఇస్కఫ్ చేస్తున్న కృషిని అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మార్కండేయులు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు జానపద కళా ఉత్సవం అంగరంగ వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఏపీ జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో సుమారు వంద మంది కళాకారులు పాల్గొని 30కి పైగా ప్రదర్శనలు నిర్వహిస్తారని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఇస్కఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఇస్కఫ్ అధ్యక్షుడు ఉప్పల అప్పలరాజు, ఉత్సవాల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు టి.ఎస్.సుకుమారన్, ప్రధాన కార్యదర్శి డి.మార్కండేయులు, కోశాధికారి కె.సత్యాంజనేయ, కల్చరల్ సెక్రటరీ సీహెచ్.మధుబాబు, రాంప్రభు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలో ఘనంగా దత్త జయంతి



ధ్యాన మందిరంలో అన్నాభిషేకం నిర్వహించిన భక్తులు



ధ్యాన మందిరంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న మాలధారులు

తాటిచెట్లపాలెం : రైల్వే న్యూ కాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో శనివారం దత్త జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయిబాబాకు పంచామృతాభిషేకాలు, విశేష అభిషేకాలు చేశారు. 9 గంటల నుంచి దత్తాత్రేయ పూజ చేశారు. ఈ పూజలో భక్తులు స్వహస్తాలతో స్వామివారికి అన్నాభిషేకం జరిపారు. మధ్యాహ్న హారతి అనంతరం నిత్యాన్నప్రసాదం నిర్వహించారు. అనంతరం మాలధారులకు అన్నప్రసాదం వడ్డించారు. శనివారంతో ఈ ప్రత్యేక అన్నదానం 41 రోజులు పూర్తయ్యాయని, ఇప్పటి వరకు సుమారు 9 వేల మంది మాలధారులు అన్నప్రసాదం స్వీకరించారని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. రాత్రి 7 గంటల నుంచి దత్తాత్రేయునికి, సాయిబాబాకు విశేష పుష్పార్చన, శేజ్ హారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

టెండరు పేరుతో ఎవరొచ్చినా అడ్డుకుంటాం



పోర్టు హాస్పిటల్ ఎదురుగా దీక్ష శిబిరంలో నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ టెండరు పేరుతో ఎవరొచ్చినా అడ్డుకుని తీరుతామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 75వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా శనివారం దీక్షలో సీఐటీయూ అధ్యక్షుడు జె.సత్యనారాయణ మాట్లాడుతూ హాస్పిటల్ టెండరు పేరుతో ఎవరొచ్చినా అడ్డుకుని తీరాలని, తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సుమారు 40 వేల మంది కృషితో ఆస్పత్రి ఏర్పాటైందని, దీనిని ప్రైవేటీకరిస్తే ఊరుకోమని హెచ్చరించారు. పోర్టు వద్దే ఉన్న నిధులతో ఆస్పత్రిని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ నిర్ణయం కొనసాగించే పక్షంలో కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల మద్దతుతో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో కె.సత్యనారాయణ, శంకర్రావు, సీహెచ్ త్రినాథరావు, కేఎస్ కుమార్, శ్రీను, రాఘవులు, విజయారావు, నర్సింగరావు, తదితరులు పాల్గన్నారు.

మద్దతుదారుల విశ్వాసాన్ని కాపాడుకుంటాం

తాటిచెట్లపాలెం : ఇటీవల జరిగిన రైల్వే గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ వాల్తేర్ డివిజన్ అత్యధిక శాతం ఓట్లు సాధించిందని యూనియన్ డివిజినల్ కో ఆర్డినేటర్ పి.రామమోహనరావు తెలిపారు. ఎన్నికల ఫలితాలపై శనివారం ఆయన మాట్లాడారు. ఒంటరిగా పోటీ చేసిన శ్రామిక్ యూనియన్ 42 శాతం ఓట్లు సాధించిందన్నారు. ప్రత్యేకించి వాల్తేర్ డివిజన్‌లో తమ యూనియన్‌కు 49 శాతం ఓటర్ల మద్దతు లభించడం విశేషమన్నారు. తమకు మద్దతుగా నిలిచిన కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. కార్మికులు తమపై ఉంచిన విశ్వాసాన్ని కాపాడుకుంటామని తెలిపారు. ఇంతటి భారీ విజయానికి కృషి చేసిన కేంద్ర నాయకులకు, బ్రాంచ్ కార్యదర్శులకు, కార్యవర్గ సభ్యులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

'40 ఏళ్ల స్నేహం' సావనీర్ ఆవిష్కరణ



అప్పటి ఉపాధ్యాయుల చేతుల మీదుగా సావనీర్‌ను ఆవిష్కరింపజేస్తున్న పూర్వ విద్యార్థులు

డాబాగార్డెన్స్: మహారాణిపేటలో గల సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు సందడి చేశారు. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన 1984 బ్యాచ్ విద్యార్థులు రెండు రోజుల పాటు ఉత్సవాలు జరుపుకుంటున్నారు. దీనిలో భాగంగా 40 ఏళ్ల స్నేహం.. సావనీర్‌ను అప్పటి ఉపాధ్యాయుల చేతుల మీదుగా పూర్వ విద్యార్థులు ఆవిష్కరించారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు కె.చంద్రశేఖరం, రాదా ప్రసాదరావు, మరియదాస్, జోజిబాబు, డి.కొండలరావు, ప్రసాదరావు పూర్వ విద్యార్థుల సేవలను కొనియాడారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డీవీ చలం, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
8309817091

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com